క్లుప్తంగా

రైళ్లు నిలిపే వరకు దీక్షలు

జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి



దీక్షలో పాల్గొన్న జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి నాయకులు

బషీరాబాద్: నావంద్గీ రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలిపేవరకు దీక్షలు కొనసాగించాలని బషీరాబాద్ జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలపాలని 12 రోజులుగా చేపట్టిన దీక్షలకు ఆయన సోమవారం సంఘీభావం తెలిపారు. ఎంతో కాలంగా అధికారులకు, కేంద్ర మంత్రులకు వినతులు ఇచ్చినా స్పందించక పోవడం సరి కాదన్నారు. బీజేపీ నాయకులు కేంద్రం మంత్రుల వద్ద సమస్యను వివరించి ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సాధన సమితి సభ్యులు జయరాంచారి, నాగప్ప, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం దర్శనానికి 'భక్త సిరియాల' బృందం



మల్లికార్జున స్వామిని దర్శించుకున్న నాటక పాత్రధారులు

యాలాల: మండలంలోని హాజీపూర్ గ్రామంలో గత వారం నిర్వహించిన భక్త సిరియాల నాటక పాత్రదారుల బృందం సోమవారం సర్పంచ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో శ్రీశైల మల్లికార్జున స్వామి దర్శనానికి వెళ్లారు. నాటక ప్రదర్శన సమయంలో సర్పంచ్ తన వంతుగా పాత్రదారులను శ్రీశైల దర్శనానికి తీసుకెళతానని హామీ ఇచ్చారు. అందులో భాగంగానే అందరిని దర్శనానికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు రాజేందర్, శ్రీనివాస్, మహిపాల్, కృష్ణ, పకీరప్ప, మల్కప్ప, నర్సప్ప, రమేష్, అనంతయ్య తదితరులు ఉన్నారు.

శ్రీనివాస్‌గుప్తా సేవలు అభినందనీయం

వైశ్య ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు సంతోష్



శ్రీనివాస్‌గుప్తాను సన్మానిస్తున్న సంతోష్‌కుమార్

తాండూరు టౌన్: తెలంగాణ రాష్ట్ర టూరిజం అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీఎస్‌టీడీసీ) చైర్మన్‌గా విధులు నిర్వర్తించిన ఉప్పల శ్రీనివాస్ గుప్తా సేవలు అభినందనీయమని వైశ్య ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు రొంపల్లి సంతోష్ కుమార్ అన్నారు. రెండేళ్ల పాటు సేవలు అందించి ఇటీవలే పదవీకాలం ముగించుకున్న శ్రీనివాస్‌గుప్తాను సంతోష్‌కుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. భవిష్యత్‌లో ఆయన మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న నేతలు

కుల్కచర్ల: ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేశామని దళితమోర్చా మండల అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఆయన మండల పరిధిలోని ముజాహిద్‌పూర్ గ్రామంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎండలు తీవ్రమవుతున్న నేపథ్యంలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయండి

షాద్‌నగర్‌రూరల్: ప్రభుత్వ రిటైర్డ్ పెన్షనర్స్‌కు పెన్షన్ చెల్లింపులో సీపీఎస్ కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వ రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ తాలుకా అధ్యక్షుడు రామారావు అన్నారు. ప్రభుత్వ రిటైర్డ్ పెన్షనర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం రిటైర్డ్ పెన్షనర్స్ యూనియన్ నాయకులు జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నా కార్యక్రమానికి తరలి వెళ్లారు. దర్నాకు తరలిన వారిలో ప్రభుత్వ రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా సహాయ కార్యదర్శి దుగ్గశేఖర్, తాలుకా ప్రధాన కార్యదర్శి జనార్దన్, ట్రెజరర్ పాండు, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం కోటా పెంపు

- ఒక్కో యూనిట్‌కు అదనంగా కిలో పెంచిన రాష్ట్ర ప్రభుత్వం
- కేంద్రం వాటా కలుపుకొని ఆరు కిలోలు ఇవ్వాలని ఆదేశం



దౌల్తాబాద్: ఆహారభద్రత కార్డులో పేరున్న ప్రతీ ఒక్కరికీ చౌక ధరల దుకాణాల ద్వారా ఇక నుంచి ఆరు కిలోల చొప్పున రేషన్‌బియ్యాన్ని పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు పౌరసరఫరాల శాఖకు ఆదేశాలు జారీ చేశారు. కరోనా తర్వాత పేద, మధ్య తరగతి కుటుంబాలను ఆదుకోవాలనే ఉద్దేశంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 2022 డిసెంబర్ వరకు యూనిట్‌కు ఉచితంగా పదికిలోల చొప్పున బియ్యం పంపిణీ చేశాయి. ఈ ఏడాది చివరి వరకు ఉచిత బియ్యం పంపిణీని కొనసాగించాలని కేంద్రం నిర్ణయించినా రాష్ట్ర వాటా కేటాయించలేదు. దీంతో మూడు నెలలుగా లబ్ధిదారులకు ఐదు కిలోల చొప్పున మాత్రమే రేషన్ బియ్యం అందుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల నుంచి ఒక కిలో అదనంగా ఇవ్వాలని నిర్ణయించింది. దీంతో ఆరు కిలోల చొప్పున అందిచనున్నారు.

36 రేషన్‌దుకాణాలు

మండల పరధిలోని 36 రేషన్‌దుకాణాల పరిధిలో 12 వేలకుపైగా రేషన్ కార్డులున్నాయి. వీటికి సంబంధించి ఆయా లబ్ధిదారులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి ఆరు కిలోల చొప్పున ఉచితంగా బియ్యం పంపిణీ చేయనున్నారు. ఇప్పటికే కొన్ని రేషన్ దుకాణాల నుంచి లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేస్తున్నారు.

ఆరు కిలోల చొప్పన అందిస్తున్నాం



ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒక్కో లబ్ధిదారుడికి ఈ నెల నుంచి రాష్ట్ర కోటా కిలో కేంద్రం కోటా ఐదు కిలోల కలుపుకుని మొత్తం ఆరు కిలోల రేషన్‌బియ్యం ఉచితంగా అందజేస్తున్నాం. ఇప్పటికే బియ్యాన్ని రేషన్ షాపులకు చేరింది. ప్రతీ నెల ప్రభుత్వ ఆదేశాల మేరకు బియ్యం పంపిణీ చేస్తాం.

– కృష్ణయ్య, తహసీల్దార్

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



న్యూట్రిషన్ కిట్‌లు పంపిణీ చేస్తున్న వైద్యాధికారులు

కుల్కచర్ల: ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యాధికారి వాజుద్దీన్, వైద్యురాలు మాధురి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో పలువురికి కేసీఆర్ న్యూట్రిషన్ కిట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గర్భిణులకు పౌష్ఠికాహారం అందించాలనే సంకల్పంతో న్యూట్రిషన్ కిట్‌లను అందించామన్నారు. ఇవి గర్భిణులకు సుఖ ప్రసవం గావించేందుకు, పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉండేందుకు ఉపకరిస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ చంద్రప్రకాశ్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'పల్లె పల్లెకూ పైలట్'

పెద్దేముల్: మండల పరిధిలో ఈ నెల 11 నుంచి 15 వరకు పల్లె పల్లెకు పైలట్ రోహిత్‌రెడ్డి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ అనురాధ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని గ్రామాల సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ప్రజావాణికి మూడు దరఖాస్తులు

బంట్వారం: ప్రజావాణికి మూడు ఫిర్యాదులు అందాయి. సోమవారం రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి ఫిర్యాదులు స్వీకరించారు. వెంటనే మీ సేవా కేంద్రంలో దరఖాస్తు పెట్టించారు. ధరణికి సంబంధించిన అర్జీలే ఎక్కువగా వస్తున్నాయని.. రికార్డులు సరిచూసి ధరణిలో దరఖాస్తు చేసుకునే విధానాన్ని ఆయన రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఫార్మేషన్ రోడ్డు పనులు ప్రారంభం

దోమ: గ్రామాల్లోని రైతులు ఉపాధి హామీ పనులను వినియోగించుకోవాలని సర్పంచ్ తారీబాయ్, ఎంపీటీసీ సభ్యుడు రాములు తెలిపారు. మండల పరిధిలోని బొంపల్లి తండాలో రైతులు పొలాలకు వెళ్లే ఫార్మేషన్ రోడ్డు పనులను సోమవారం ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు పొలాలకు వెళ్లేందుకు ఇబ్బంది పడుతుండడంతో ఈ పనులు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి, గ్రామస్తులు మాన్య, శంకర్‌నాయక్, గోపాల్, రైతులు, కూలీలు తదితరులు పాల్గొన్నారు.

కొలతలకు అనుగుణంగా యూనిఫాం కుట్టండి

టైలర్లకు ఎంఈఓ సూచన

కుల్కచర్ల: యూనిఫాంలు విద్యార్థుల కొలతలకు అనుగునంగా కుట్టి ఇవ్వాలని ఎంఈఓ హబీబ్ అహ్మద్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో పలు పాఠశాలల దుస్తులను టైలర్లకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాల ప్రారంభించే నాటికి దుస్తులు పంపిణీ చేసేలా సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కామునిపల్లి సర్పంచ్ మైపాల్ రెడ్డి, సీఆర్పీ మైపాల్, కుల్కచర్ల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఈత వనాలను కాపాడండి

కొడంగల్: మండల పరిధిలోని రుద్రారం గ్రామంలో ఉన్న ఈత వనాలను కాపాడాలని గౌడ సంఘం నాయకులు, గీత కార్మికులు ఆబ్కారీ సీఐ సైదులుకు సోమవారం ఫిర్యాదు చేశారు. గ్రామంలో ఉన్న ఈత చెట్లను జేసీబీ సాయంతో కొందరు తొలగించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. గౌడ కులస్తుల జీవనాధారమైన కల్లును ఇచ్చే ఈత చెట్లను నరికి వేస్తున్నారని తెలిపారు. అధికారులు స్పందించి గీత కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. లేదంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

ఎస్ఎస్ఏ సంఘం అధ్యక్షురాలు దేవి



ఎస్ఎస్ఏ నూతన కమిటీ సభ్యులు

కుల్కచర్ల: సర్వశిక్ష అభియాన్ ఉద్యోగుల హక్కులను కాపాడేందుకు నిర్విరామంగా కృషిచేస్తామని సర్వశిక్షా అభియాన్ ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షురాలు దేవి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నూతనంగా సర్వశిక్షా అభియాన్ ఉద్యోగుల నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షురాలిగా దేవి, ప్రధాన కార్యదర్శిగా లక్ష్మయ్య, సమన్వయకర్తగా కృష్ణయ్య, ప్రచార కార్యదర్శిగా చెన్నయ్య, ఉపాధ్యక్షురాలిగా సువర్ణ, సలహాదారుడిగా రాములును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షురాలు మాట్లాడుతూ.. కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న తమను క్రమబద్ధీకరించే వరకు పోరాడుతామన్నారు.

పేదలకు అందని ప్రభుత్వ వైద్యం



స్ట్రెచర్‌పై గాయపడిన వ్యక్తి



కొడంగల్ ఆస్పత్రి

- రోగులతో దురుసుగా ప్రవర్తిస్తున్న వైద్యులు
- ప్రాథమిక చికిత్స చేయకుండానే తాండూరుకు తరలింపు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న బాధితులు

కొడంగల్: ప్రభుత్వాసుపత్రిలో వైద్యులు సక్రమంగా విధులకు హాజరు కాకపోవడంతో పేదలకు వైద్యం అందక ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఉచితంగా వైద్యం అందించాలనే సంకల్పంతో ముందుకు సాగుతుంటే కొందరు వైద్యాధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ ఆశయం నీరుగారుతోంది.

అందుబాటులో ఉండని వైద్యులు

కొడంగల్ పెద్దాసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్యం అందడం లేదు. పేరుకు మాత్రమే పెద్దాసుపత్రి. ఇక్కడ డాక్టర్లు అందుబాటులో ఉండరు. ఉన్నవాళ్లు వంతుల వారీగా విధులు నిర్వహిస్తున్నారు. రోజుకు ఒకరు చొప్పున విధులకు హాజరవుతున్నారు. సోమవారం విధుల్లో ఉన్న వైద్యుడు దురుసుగా ప్రవర్తించారని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని రావులపల్లి గ్రామానికి చెందిన రామకృష్ణ అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రికి వచ్చాడు. కనీస ప్రాథమిక చికిత్స కూడా చేయకుండా తాండూరుకు వెళ్లాలని దబాయించారని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపించారు. గాయపడ్డ వ్యక్తికి పరిచయం ఉన్న ఓ విలేకరి డాక్టర్‌తో మాట్లాడేందుకు యత్నిస్తే దురుసుగా ప్రవర్తించాడని రిపోర్టర్ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ప్రతీ రోజు ఇలాంటి సంఘటనలు అనేకం జరుగుతున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. గత నెలలో కలెక్టర్ నారాయణరెడ్డి కొడంగల్ ఆస్పత్రికి సందర్శించారు. రోగులకు మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. అయినా వైద్యుల్లో మార్పు లేదు. ప్రభుత్వం బయోమెట్రిక్, జియోట్యాగ్ హాజరు పెట్టినా పట్టించుకోవడం లేదు. వైద్యులు ఆస్పత్రికి ఎప్పుడు వస్తారో ఎప్పుడు వెళ్తారో తెలియని పరిస్థితి నెలకొంది. వంతుల వారీగా విధులు నిర్వహిస్తూ రోగులను ఇబ్బందులకు గురి చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పర్మినెంట్ వైద్యులు లక్షల్లో వేతనాలు తీసుకుంటూ చుట్టపు చూపుగా ఎప్పుడో ఒక రోజు వచ్చి వెళ్తున్నారనే అపవాదు ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పేదలకు వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

'డబుల్' దరఖాస్తుల పరిశీలన



దరఖాస్తుదారుల వివరాలు సేకరిస్తున్న అధికారులు

ధారూరు: డబుల్ ఇళ్లకు దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్ల వద్దకు వెళ్లి అధికారులు విచారణ ప్రారంభించారు. గ్రామ పంచాయతీ పరిధిలోని లక్ష్మీనగర్ తండా, ధారూరు, తిమ్మానగర్ గ్రామాల్లో డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం 546 దరఖాస్తులు వచ్చాయి. ఈ దరఖాస్తుదారుల పరిశీలనకు ఐదు టీంలు విచారణ చేపట్టాయి. వివిధ శాఖల అధికారులు ఐదు టీంలు ఏర్పాటు చేసి ఒక్కో బృందానికి 110 దరఖాస్తులు ఇచ్చి పరిశీలన చేపట్టాలని తహసీల్దార్ భువనేశ్వర్ ఆదేశించారు. వారి ఇళ్లకు వెళ్లిన అధికారులు ఫార్మాట్ ప్రకారం విచారణ చేపట్టారు. కాగా ధారూరు మండల కేంద్రంలో దరఖాస్తు దారుల చిరునామాలు దొరక్క విచారణ ప్రక్రియ మందకొడిగా సాగిందని విచారణ అధికారి సంజూరాథోడ్ తెలిపారు.

సఫాయి కార్మికులకు సన్మానం



పూడూరు: పంచాయతీ కార్మికులను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

పూడూరు: బీజేపీ ఆధ్వర్యంలో సఫాయి కార్మికులు, సామాజిక కార్యకర్తలను సన్మానిస్తామని పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు రవీందర్ అన్నారు. సోమవారం భారత రాజ్యాంగ నిర్మాత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని మండల పరిధిలోని కంకల్ గ్రామంలో పంచాయతీ కార్మికులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల ఎస్సీ మోర్చా అధ్యక్షుడు డప్పు అశోక్, బీజేపీ నాయకులు శ్రీశైలం, వీరన్న, పంచాయతీ కార్యదర్శి జహంగీర్, తదితరులు పాల్గొన్నారు.

దళిత మోర్చా ఆధ్వర్యంలో..



కుల్కచర్లలో..

కుల్కచర్ల: అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా ప్రతీ ఒక్కరూ ముందుకుసాగాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కరణం ప్రహ్లాదరావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో బీజేపీ దళిత మోర్చా జిల్లా కార్యదర్శి సంగెం శ్రీనివాస్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి వారోత్సవాల సందర్భంగా పంచాయతీ కార్మికులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మైపాల్, ప్రధాన కార్యదర్శి హన్మంతు, బీసీ మోర్చా మండల అధ్యక్షుడు వెంకటయ్య, నాయకులు అంజిలయ్య, కాటనిపల్లి మైపాల్, శివసంతోశ్, చంద్రమౌలి, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

తహసీల్దార్ షాహెదా బేగం



దోమ: తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న కిష్టాపూర్ గ్రామస్తులు

దోమ: ప్రజావాణిలోని ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ షాహెదా బేగం అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రైతుల నుంచి నాలుగు ఫిర్యాదులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడండి

కిష్టాపూర్‌లోని సర్వే నెంబర్ 198లో ప్రభుత్వ భూమిని కొందరు గ్రామస్తులు కబ్జాకు చేస్తున్నారని సర్పంచ్ సత్యమ్మ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. అట్టి వ్యక్తులపై చర్యలు తీసుకుని ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ అనసుజ, గ్రామస్తులు వెంకటేశ్‌గౌడ్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుతాం

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకట్రావు



బాలంపేటలో కాంగ్రెస్ నాయకుల ప్రచారం

దౌల్తాబాద్: ప్రజా వ్యతిరేక విధానాలపై నిరంతరం పోరాడుతామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్రావు అన్నారు. సోమవారం ఆయన మండల పరిధిలోని సుల్తాన్‌పూర్, గుండేపల్లి గ్రామాల్లో హాత్ సే హాత్ జోడో యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.500కు వంట గ్యాస్ సిలిండర్, ఏక కాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను వివరించారు. ఈ కార్యక్రమం నాయకులు వీరన్న, వెంకట్రాములు, రాములు, మాధవరెడ్డి, కృష్ణ, సంజీవ్, మహిపాల్, రాజు, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నెల రోజులపాటు 'ఇంటింటికీ సీపీఐ'



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

పరిగి: నెల రోజుల పాటు ఇంటింటికీ సీపీఐ కార్యక్రమాన్ని చేపడుతున్నామని పార్టీ డివిజన్ కార్యదర్శి పీర్ మహ్మద్ అన్నారు. సోమవారం పట్టణ కేంద్రంలో ఈ కార్యక్రమాన్ని సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీర్ మహ్మద్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు చేస్తున్న అన్యాయాలపై పోరాటం కొనసాగిస్తామన్నారు. ప్రభుత్వాలు పేదలకు చేస్తున్న అన్యాయాలను ప్రజలకు వివరిస్తామని చెప్పారు. ఈ నెల 14 నుంచి వచ్చే నెల 14వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని వివరించారు. ప్రతీ ఒక్కరు ఈ కార్యక్రమాన్ని విజవయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి వెంకటేశ్, నాయకులు జంగయ్య, చంద్రయ్య, రాములు, చంద్రనాయక్, రాములు తదితరులు పాల్గొన్నారు.

సాగు పద్ధతులపై రైతులకు అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

చేవెళ్ల: యాసంగిలో రైతులు సాగు చేసే వరిసాగులో సరైన యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు పొందాలని మండల వ్యవసాయాధికారి తులసి అన్నారు. మండలంలోని రేగడిఘనాపూర్ గ్రామంలో సోమవారం సర్పంచ్ నర్సింలు ఆధ్వర్యంలో క్షేత్రదినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పొలాల వద్ద రైతులకు అవగాహన కల్పించారు. యాసంగి సీజన్‌లో రైతులకు సాగుపద్ధతుల్లో ట్రైకోడర్మా విరిడె వినియోగ,ం పీఎస్‌బీ వినియోగ౦, వరిలో వెదజల్లే పద్ధతి, దఫాలుగా ఎరువుల వినియోగం మొదలైన వాటిపై అవగాహన కల్పించారు. రైతులు సరైన పద్ధతులను పాటించి సాగు చేస్తే మంచి దిగుబడులు సాధిస్తారని చెప్పారు. ట్రైకోడర్మా వరిడె వల్ల నేలలోని సారాన్ని పెంచి మొక్కలకు తెగుళ్ల రాకుండా నివారిస్తోందని చెప్పారు. పీఎస్‌బీ (పాస్పరస్ సాలుబులైజింగ్ బాక్టీరియా)వినియోగం వల్ల నెలలో ఉన్న పాస్పరస్ మొక్క తేలికగా తీసుకొనే రూపంలోకి మర్చుతుందన్నారు. దీని వల్ల హెక్టారుకు ఒక బస్తా ఖర్చు ఆదా అవుతుందని చెప్పారు. వరిలో వెదజల్లే పద్ధతి వల్ల నేరుగా విత్తుకునే వరి మన నాటు ఖర్చు ఉండదని చెప్పారు. పంట కాలం 10రోజులు తగ్గుతుందని చెప్పారు. ఎకరానికి 8వేల వరకు ఖర్చు ఆదా అవుతుందని చెప్పారు. దఫాలుగా ఎరువుల వినియోగం వల్ల ఒకేసారి కాకుండా దఫాలుగా వేసుకోవడం వల్ల పంటకు బాగా ఎరువులు అందుతాయని చెప్పారు. అధిక దిగుబడులకు అవకాశం ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు బర్కల రాంరెడ్డి, వ్యవసాయ విస్తారణ అధికారులు బాలక్రిష్ణ, రమేశ్, వరుణ్, రాజేశ్వర్‌రెడ్డి, స్వాతి, గ్రామరైతులు పాల్గొన్నారు.

ప్రాథమిక చికిత్సగా సీపీఆర్

డిప్యూటీ డీఎంహెచ్ఓ దామోదర్, ఎంపీపీ విజయలక్ష్మి



ఎంపీపీతో సీపీఆర్ చేయిస్తున్న దామోదర్

చేవెళ్ల: అకస్మాత్తుగా ఎవరికైనా గుండెపోటు వచ్చినట్లు గుర్తిస్తే వెంటనే అందుబాటులో ఉండే వైద్యసిబ్బంది వారికి ప్రాథమిక చికిత్సగా సీపీఆర్ చేసే విధంగా ప్రతి ఒక్కరు అవగాహన కల్గి ఉండాలని చేవెళ్ల డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్ఓ దామోదర్, ఎంపీపీ విజయలక్ష్మిలు అన్నారు. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం మండలంలోని ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లు, ప్రభుత్వ కార్యాలయ సిబ్బందికి సీపీఆర్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్లు ప్రసాద్, రఘుబాబు, గోపాల్‌రెడ్డి తదితరులు హాజరై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గుండెపోటుకు గురైతే వెంటనే స్పందించి వారికి ప్రాథమిక చికిత్స చేసి అంబులెన్స్ ద్వారా పెద్ద ఆస్పత్రికి తరలించే ఏర్పాటు చేయాలన్నారు. దీంతో గుండెపోటుతో అకస్మాత్తుగా చనిపోతున్న వారి సంఖ్యను తగ్గించేందుకు వీలు అవుతుందన్నారు. ప్రభుత్వం దీనిపై అందరికి అవగాహన ఉండాలని ప్రతి ఒక్కరికి ప్రాథమిక చికిత్సలు, సీపీఆర్ ఎలా చేయాలనే దానిపై శిక్షణ ఇస్తుందని చెప్పారు. విదేశాల్లో ఇలాంటి రోగులకు సీపీఆర్ చేయడం వల్ల నూటికి 70శాతం మరణాలు తగ్గుతున్నాయన్నారు. మన రాష్ట్రంలో కూడా దాదాపుగా అందరూ శిక్షణ పొందితే భవిష్యత్తులో గుండెపోటు వచ్చినప్పడు ప్రథమ చికిత్స అందిస్తే గుండెపోటు మరణాలు తగ్గుతాయని చెప్పారు. కార్యక్రమంలో మండలంలోని ఆశవర్కర్లు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు ఉన్నారు.